క్లుప్తంగా

కరెంటు స్తంభం ఏర్పాటు



కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం వెంకటాపురం అన్నస్వామిపల్లె రహదారిలోని విరిగి పోయిన కరెంటు స్తంభాన్ని సోమవారం ట్రాన్స్‌కో అధికారులు తొలగించారు. ఆదివారం ట్రాక్టర్ ఢీకొనడంతో ఇది విరిగిపోయింది. రెండు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. దాని స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

నారాయణవనం: స్థానిక వీరరాఘవస్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం సీతారాముల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. శ్రీరామ నవమి రోజు ఆలయంలో నిర్వహించే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం సీతారాముల చిత్రపటాన్ని ఉయ్యాలపై అధిష్టింప చేశారు. రిత్వికుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

పీఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

సత్యవేడు: ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సత్యవేడు తాలుకా యూనిట్ అధ్యక్షుడిగా హేమభూషణం ఎన్నికయ్యారు. సత్యవేడులో ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా నాయకులు సోమవారం చంద్రశేఖర్ రెడ్డి, చెంచురత్నం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న హేమభూషణం అధ్యక్షుడిగా, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వాసుదేవరావు ఉపాధ్యక్షుడిగా, రెడ్డి ప్రసాద్ జనరల్ సెక్రటరీగా, నందగోపాల్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా సురేష్‌కుమార్, జిల్లా కౌన్సిల్ వన్‌గా నారాయణయాదవ్, జిల్లా కౌన్సిల్ టూగా నాగరాజు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని త్రివిక్రమరావు, శివయ్య రెడ్డి తదితరులు సత్కరించారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న కార్యదర్శి షణ్ముగం

నారాయణవనం: గ్రామ పంచాయతీ ఆదాయానికి సహకరిస్తూ అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పంచాయతీ కార్యదర్శి షణ్ముగం అన్నారు. మండలంలోని పంచాయతీల కార్యాలయాల్లో సోమవారం అంబేద్కర్ జయంతిని జరుపుకుని, సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. నారాయణవనం పంచాయతీ గ్రామ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సుమన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అందించే నిధులను సకాలంలో వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు, మహిళలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మోకాలి మార్పిడి స్క్రీనింగ్ పరీక్షలకు స్పందన

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రోబోటిక్ డే సందర్భంగా రేణిగుంట సమీపంలోని అమర హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత రోబోటిక్ ఆర్మ్–అసిస్టెడ్ మోకాలి మార్పిడి స్క్రీనింగ్ పరీక్షలకు మంచి స్పందన లభించిందని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గారినేని తెలిపారు. చైర్మన్ డాక్టర్ ప్రసాద్ గారినేని మాట్లాడుతూ, శిబిరంలో 80 మంది రోగులు హాజరయ్యారని, వీరిలో 50 మందికి పైగా మోకాలి మార్పిడి శస్త్రచికిత్స అవసరమని గుర్తించినట్లు చెప్పారు. రోబోటిక్ సహాయంతో జాయింట్ రీ–ప్లేస్‌మెంట్ సర్జరీ ప్రయోజనాల గురించి అవగాహన పెంచడం, రాయలసీమ జిల్లాలు, చెన్నై ప్రజలకు అధునాతన ఆర్థోపెడిక్ కేర్‌ను మరింత అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్లు,సిబ్బంది పాల్గొన్నారు.







తొట్టంబేడులో నివాళులు అర్పిస్తున్న వాసుదేవనాయుడు దంపతులు, రేణిగుంట అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన నాయకులు, ఏర్పేడులో.., వరదయ్యపాళెం: నివాళులర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు, సత్యవేడు: మాట్లాడుతున్న నూకతోటి రాజేష్

జై భీమ్..!

- పలుచోట్ల ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు
- రాజ్యాంగ స్ఫూర్తితో జగనన్న పాలన చేస్తే అంబేడ్కర్ ఆశయాలకు భిన్నంగా కూటమి అరాచక పాలన
- మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి విమర్శ

శ్రీకాళహస్తి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 135వ జయంతి వేడుకలను శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, దళిత నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాటామాట్లాడారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులుగా ఐదుగురు దళితులకు, మైనారిటీ, బీసీలకు అవకాశం కల్పించారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి స్థానాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఇచ్చిందని, ఎస్సీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. అంబేడ్కర్ ఆశయాలకు భిన్నంగా అరాచక పాలన చేస్తోందని ఆరోపించారు. అలాగే అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి బీజేపీ నాయకుడు కోలా ఆనంద్‌తో కలిసి నివాళులర్పించి మాట్లాడారు. టీడీపీ నాయకుడు ఎస్సీవీ నాయుడు, జనసేన నాయకులు కోటా వినుత, కాంగ్రెస్ నాయకులు బత్తినాయుడు, దామోదర్ రెడ్డి, వామపక్షాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ వేర్వేరుగా నివాళులు అర్పించారు. అలాగే ముక్కంటి ఆలయంలో ఈవో బాపిరెడ్డి అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ, పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం చుట్టూ విచ్చలవిడిగా మద్యం షాపులు ఏర్పాటు చేయడం చూస్తే ప్రభుత్వం అంబేడ్కర్‌కు ఏపాటి విలువ ఇస్తోందో ఇట్టే తెలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరు చెంగయ్య, శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, ,తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పసల కృష్ణయ్య, నియోజవర్గ, తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పసల కృష్ణయ్య, నియోజవర్గ యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్, మాజీ కౌన్సిలర్ కంటా ఉదయ్ కుమార్, అర్కాట్ ముత్తు పూడి రవి, ఫజల్, పసల సురేష్, చంద్ర, చాలా జయరామయ్య, సునీత సింగ్, షర్మిల ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీవీఏ కాలేజీలో..

శ్రీకాళహస్తి: స్థానిక ఎస్పీవీఏ ప్రభుత్వ కాలేజీలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజ నాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. చదువుల్లో అంబేడ్కర్ ఎన్నో డిగ్రీలు పొందారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు రాణించాలన్నారు. అధ్యాపకులు గంగారామ్, పరంధామయ్య, రాజేంద్రుడు, మునెయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత, డాక్టర్ సుధీర్, సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలోని అంబేడ్కర్ విగ్రహానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, తమ పార్టీ నేతలతో కలిసి పూలమాలలు వేశారు. మధ్యాహ్నం పేదలకు ప్రభాకర్ అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం మండల అధ్యక్షుడు డాక్టర్ గౌరీ శంకర్, ఇన్బనందన్, ఐజయ్య, జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, గణేష్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి సీపీఐ నాయకుడు తులసి రాజన్ ఆధ్వర్యంలో నాయకులు నివాళులు అర్పించి అన్నదానం చేశారు. ఎస్ఎన్ పురం, వెదళ్ల చెరువులోని అంబేడ్కర్ విగ్రహాలకు వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోవతి, చంద్రారెడ్డి మహిళలు, గాజుల మండ్యం సచివాలయంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ గంగారి రమేష్, ఎల్ఎన్ కండ్రిగ పాఠశాలలో ఆకాంక్ష స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిబాబు, సీఆర్ఎస్‌లోని సంఘ కార్యాలయం వద్ద ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు నిర్వహించిన వేడుకల్లో సీడబ్ల్యూఎం దేవసహాయం, అసోసియేషన్ సెక్రటరీ సూర్యనారాయణ, ప్రెసిడెంట్ రాజు, సంఘ చైర్మన్ మునెయ్య, సెక్రటరీ బాబు, ఓబీసీ అసోసియేషన్ సెక్రటరీ వెంకటరమణ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏర్పేడులో..

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కూనాటి రమణయ్య యాదవ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు నల్లపాలెం శివయ్య, పాగాలి సర్పంచ్ రాజేశ్వరి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ నాయకులు చెంగల్రాయులు, శివ, కృష్ణయ్య, నాగరాజు, లక్ష్మయ్య, వయల్ రెడ్డి, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.




బుచ్చినాయుడుకండ్రిగ: అన్నదానం చేస్తున్న రాజేష్, నారాయణవనం: అల్పాహారం పంపిణీ



నాగలాపురం: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



శ్రీకాళహస్తి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

అంబేడ్కర్ గొప్ప దార్శనికుడు

వరదయ్యపాళెం: అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని దళిత సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉద్ఘాటించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు చిన్నా, నాయకులు సత్యానందం, వెంకటసుబ్బయ్య, మునిసుబ్రమణ్యం, ఎన్టీఆర్ వెంకయ్య, వెంకటరమణ, శిబిచక్రవర్తి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు

సత్యవేడు/బుచ్చినాయుడుకండ్రిగ: భావితరాలకు అంబేడ్కర్ ఆదర్శ ప్రాయుడని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అంబేడ్కర్ స్ఫూర్తితో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. బుచ్చినాయుడుకండ్రిగలోని పచ్చాలమ్మ కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నూకతోటి రాజేష్ కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బీరేంద్రవర్మ, భానుప్రకాష్ రెడ్డి, మండలాల కన్వీనర్లు కే.సుశీల్ కుమార్ రెడ్డి, కొనతనేని మణినాయుడు, కే.చంద్రశేఖర్ రెడ్డి, ఏఎంసీ బాలాజీ రెడ్డి, సర్పంచ్ రమేష్, బూత్‌కమిటీ నియోజకవర్గ కన్వీనర్ బందెల సురేష్, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి గురునాథం, డి.వేణు, ఎంపీ రవి, గోవిందస్వామి, సోమశేఖర్, గురుప్రసాద్, పళణి, రాబర్ట్, మస్తాణి, శేఖర్, టెంకాయల కృష్ణయ్య, మాణిక్యం, రమణ, జోషఫ్, వంశీ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మోహన్ రెడ్డి, శ్రీరాములు రెడ్డి, లాయర్ రాజ, సన్యాసయ్య, సోము, అజయ్‌కుమార్‌రెడ్డి, గురవయ్య, దేవదాసురెడ్డి, ప్రసాద్‌పాల్, సంజీవయ్య, కత్తిశివ, అమరలింగయ్య పాల్గొన్నారు.

వాడవాడలా అంబేడ్కర్ జయంతి

నారాయణవనం: స్థానిక బైపాస్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జెడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పారిశుద్ధ్య కార్మికులకు, పేదలకు దుస్తులను అందజేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సొరకాయలు ఆధ్వర్యంలో అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాకేష్ కిరణ్, రాష్ట్ర వాణిజ్య విభాగ సంయుక్త కార్యదర్శి అన్నాదురై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 200 మందికి అల్పాహారాన్ని పంపిణీ చేశారు. పార్టీ ముఖ్యనాయకులు గురుస్వామి, దొరైరాజ్, శంకరయ్య, వైస్ ఎంపీపీ శివశంకర్, సర్పంచ్‌లు నాగూరు, గుణశేఖర్, సుబ్రమణ్యంరెడ్డి, ధర్మలింగం, మురళి, ఎంపీటీసీ సభ్యులు పొన్నుస్వామి, రవి, నాయకులు పీజీ బాబు, తిరువెంగడం, ఏలుమలై, కేశవులు, అశోక్, గోపాల్, చీరాలయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో ఎస్ఐ సునీల్

నాగలాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో సోమవారం అంబేడ్కర్ యువజన సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దీన్ని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. ఎస్ఐ సునీల్, కానిస్టేబుల్ సాయి రక్తదానం చేశారు. సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షులు అపరంజిరాజు, నాయకులు శ్యామ్, మహేష్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి, ఉదయ్, హరిబాబు, దేశప్పన్ ధనరాజ్, చిరంజీవి, గిరి, పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి: ఎస్పీవీఏ కాలేజీలో..



రేణిగుంట: అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్



శ్రీకాళహస్తి: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



రేణిగుంట: గణేష్‌నగర్‌లో..



రేణిగుంట సీఆర్ఎస్‌లో..

భక్తి శ్రద్ధలతో తమిళ సంవత్సరాది



క్షీర కలశాల ఊరేగింపులో భక్తులు

నారాయణవనం: మండల కేంద్రంలో తమిళులు సోమవారం నూతన సంవత్సరాదిని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. రాత్రి వళ్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి హారతులను అందుకున్నారు. ఉదయం 9 గంటలకు బైపాస్ సమీపంలోని ధూండి వినాయకస్వామి ఆలయం నుంచి 108 పాల కుండలతో సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తితో భక్తులు మేళ తాళాల మధ్య ఊరేగింపుగా టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశురేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఊరేగింపులో భక్తులు శరీరానికి త్రిశూలాలను గుచ్చుకుని చెక్క తేరును తాకుతూ మొక్కులు తీర్చుకున్నారు. పరాశురేశ్వర స్వామి ఆలయంలోని సుబ్రమణ్యస్వామికి 108 కలశాలతో క్షీరాభిషేకాన్ని నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. రాత్రి సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించిన ప్రభపై ఉభయ దేవేరులతో సుబ్రమణ్యస్వామి ఊరేగుతూ భక్తుల నుంచి హారతులను అందుకున్నారు. సముదాయంలోని అగస్తీశ్వరస్వామి ఆలయంలో, కైలాస నాథ కోనలోని కామాక్షాంభిక సమేత కైలాసనాథ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలను, పూజలు చేశారు.

బీర్ బాటిల్‌తో కొట్టాడు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం కృష్ణాపురం రైల్వే గేట్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన దాడి ఘటనపై సోమవారం ఒకరిపై కేసు నమోదు చేసినట్లు రేణిగుంట పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం..ఎస్‌యుపురం దళితవాడకు చెందిన మురళిని కృష్ణాపురానికి చుట్టంగా వచ్చిన బాషా అనే అతను గొడవ పడ్డాడు. బీర్ బాటిల్‌తో తలపై కొట్టడంతో గాయాలైన మురళిని స్థానికులు చికిత్స నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం అర్బన్ పోలీస్ స్టేషన్ కేసు నమోదు చేశారు.

స్పందన లేని గ్రామసభలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం రేణిగుంట మండలంలో నిర్వహించిన గ్రామసభలకు ప్రజల నుంచి స్పందన కరువైంది. రేణిగుంట పంచాయతీలో 16వ తేదీకి గ్రామసభ వాయిదా వేశారు. వెంకటాపురం సచివాలయ ఆవరణలో సర్పంచ్ సుశీల అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఈఓపీఆర్డీ ప్రభురావు, కార్యదర్శి హరి మాట్లాడారు. తొలుత అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు నివాళులు అర్పించి గ్రామసభను నిర్వహించారు. ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, ఎండల తీవ్రత వల్ల గ్రామసభలకు ప్రజలు రాకపోవడంతో చాలా పంచాయతీల్లో మొక్కుబడిగా సభలను నిర్వహించారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ ప్రభురావు

నోటీస్ బోర్డు

నేటి నుంచి ముత్యాలమ్మ జాతర



విద్యుత్ దీపాల శోభతో ముత్యాలమ్మ ఆలయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర అనుబంధ ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఆలయ పరిసరాలు, పట్టణంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ముత్యాలమ్మకు ప్రతి రోజూ ప్రత్యేక అలంకరణలో పూజలు చేస్తామని, భక్తులు జాతరను విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులకు గ్రామ సభ తీర్మానం



మాట్లాడుతున్న సర్పంచ్ చిన్నదొరై సుధా

నాగలాపురం: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ చంద్ర అధ్యక్షతన సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. నాగలాపురం శ్మశాన వాటిక వెళ్లే దారిలో గ్రావెల్ రోడ్డు, వడ్లకుప్పంలో గ్రావెల్ రోడ్డు, డ్రైనేజీలు, కల్వర్టులు, తారు రోడ్డు నిర్మాణం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, చెరువులు కుంటలు పూడిక తీత పనులు, పశువుల షెడ్లు, తాగునీరు, విద్యుత్, గ్యాస్ కనెక్షన్, వంటి మౌలిక సదుపాయాల కల్పనకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు అపరంజిరాజు, ఉదయ్‌కుమార్ రెడ్డి, హరిబాబు, ధనరాజ్, చిరంజీవి, ఉదయ్, వెంకటేశ్, ఏలుమలై పాల్గొన్నారు.

బెంగళూరు బస్ సర్వీసు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: బెంగళూరు–సత్యవేడు బస్ సర్వీసును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జెండా ఊపి ప్రారంభించారు. ఆర్టీసీ డీఎం కే.వెంకటరమణతో కలసి సోమవారం ఎమ్మెల్యే బెంగళూరు సర్వీసును ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రారంభించారు. అనంతరం బస్సు ఎక్కి తొలి టికెట్ తీసుకున్నారు. ఆయనతోపాటు ఆ పార్టీ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది బస్సులో ఊత్తుకోటవరకు ప్రయాణించారు. డ్రైవర్ సుధాకర్ బస్సు తొలుత నడిపారు. డీఎం మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 5గంటలకు సత్యవేడు నుంచి, రాత్రి 1.30 గంటలకు బెంగళూరు నుంచి బయలు దేరుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి. నరసింహవర్మ, గ్యారేజ్ మెకానిక్ ఇన్‌చార్జి కే.శ్రీనివాసులు, సెక్యూరిటీ ఇన్‌చార్జి పవన్‌కుమార్, వి.బాబు, ఎస్ మధుబాబు, జీ.సురేష్, వికేష్ బాషా, మురళి, రూపేష్, శశి, బాలమురళీ కృష్ణ, ఎంపీడీఓ చంద్రశేఖర్, మునికృష్ణయ్య, జయ కుమార్ పాల్గొన్నారు.

ప్రయత్నం చేస్తే సామాన్యులకైనా గొప్ప స్థానం



సభలో పాల్గొన్న ఆశ్రమ పీఠాధిపతులు

శ్రీకాళహస్తి: ప్రయత్నం చేత ఎంతటి సామాన్యులైనా గొప్ప స్థానం పొందుతారని కరీంనగర్ విష్ణు సేవానందగిరిస్వామి అన్నారు. బోయవాడైన వాల్మీకి రామనామ తపమాచరించి ఆదికవిగా సుప్రసిద్ధుడై తరించాడని, అలాగే స్వామి వివేకానంద గొప్ప ప్రయత్నం చేత ప్రపంచం నలుమూలల భారతదేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పారని ఉదహరించారు. పట్టణంలోని శుకబ్రహ్మ ఆశ్రమంలో విద్యా స్వరూపానందగిరి స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 75వ వార్షికోత్సవంలో భాగంగా 4వ రోజు సోమవారం కరీంనగర్ ఆశ్రమ పీఠాధిపతి విష్ణు సేవానందగిరిస్వామి అనుగ్రహభాషణం చేశారు. రోజూ ఆచరించే ధర్మం మంచి సత్ఫలితాన్ని ఇస్తుందన్నారు. నంబూరు చంద్రకాళీ వరప్రసాద మాతాజీ గురువు గొప్పదనంపై అనుగ్రహభాషణం చేశారు. హరి బసవ రాజేంద్ర మహాస్వామి, చంద్రకాళి మాతాజీ తదితరులు పాల్గొన్నారు.

చౌక ధరకే జన్ ఔషధ కేంద్రంలో మందులు

శ్రీకాళహస్తి: పట్టణంలో ముత్యాలమ్మ గుడి వీధిలోని ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సందర్శించారు. ముఖ్యమైన బీపీ, షుగర్, గ్యాస్, గుండె సంబంధిత మందులు చౌక ధరలో ఈ కేంద్రంలో విక్రయిస్తారని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.